
ఆసుపత్రిలో రోగులు



అన్నమో.. రామచంద్రా

- చాలీచాలని అన్నం, కూరలతో సరి
- ఒక్కోరోజు గుడ్డు కూడా మాయం
- బాలింతలకు అందని పల్లిపట్టీలు
- ఆకలికి తాళలేక రోగులు, బంధువుల అవస్థలు
- సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టర్ల వింత ధోరణి

సిద్దిపేట టౌన్, జనవరి 30 : సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ చికిత్సల నిమిత్తం వచ్చే రోగులకు కడుపునిండా అన్నం పెట్టాలన్న ఆలోచనతో గత ప్రభుత్వం 'అన్నపూర్ణ' పథకాన్ని ప్రారంభించింది. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరి వల్ల రోగులకు భోజనం అందడం లేదు. సిద్దిపేట పట్టణంలోని జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో అడ్మిట్ అయిన బాలింతలు, శస్త్రచికిత్స చేసుకున్న రోగులతో పాటు వారి బంధువులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, సాయంత్రం పల్లిపట్టీ, ఒక కోడిగుడ్డును ఇవ్వడం లేదు. ఫలితంగా రోగులకు సరైన సమయంలో భోజనం అందకపోవడంతో అన్నమో రామచంద్రా అంటూ ఆకలి కేకలు పెడుతున్నారు.


సిద్దిపేటలోని అనుబంధ మెడికల్ కళాశాలలో రోగుల బంధువులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

సిబ్బంది నిర్లక్ష్య వైఖరి

ఉదయం అల్పాహారం మధ్యాహ్నం, రాత్రి వేళల్లో చాలీచాలని అన్నం పెడుతూ రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆకలికి తాళలేక ఒక్కోసారి అన్నం ఎక్కువ పెట్టాలని రోగుల బంధువులు అడిగితే అంత కన్నా ఎక్కువ పెట్టబోమంటూ చెబుతున్నారు. ఎంత అన్నం వడ్డించాలో తమకు తెలుసన్నట్లుగా సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఇక డ్యూటీ డాక్టర్లకు కూడా డైట్ పెట్టడంలో అప్పుడప్పుడు నిర్లక్ష్యంగా ఉంటున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని డ్యూటీ డాక్టర్లు వాపోతున్నారు.

గుడ్డు, పండ్లు, పల్లీపట్టిలు మాయం

సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో అన్ని వైద్యసేవలు అందుబాటులో ఉండటంతో సిద్దిపేట జిల్లాతో పాటు పక్కనే ఉన్న ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున రోగులు చికిత్స కోసం వస్తుంటారు. రోగులకు అన్నపూర్ణ పథకంలో భాగంగా ఉదయం ఇవ్వాల్సిన అరటి పండ్లు, మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో ఇవ్వాల్సిన కోడిగుడ్డును అందించడం లేదు. బాలింతలకు ఐరన్ లోపించకుండా ఉండేందుకు ఇవ్వాల్సిన పల్లిపట్టీలు కూడా ఇవ్వడం లేదు. ఒక్కోసారి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా ఇవ్వడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు.


సిద్దిపేటలోని జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాల

చోద్యం చూస్తున్న అధికారులు

సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, అనుబంధ మెడికల్ కళాశాలలో రోగులకు భోజనం అందించడంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంలో వైద్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రిలో కాంట్రాక్ట్ దక్కించుకున్న మొదట్లో అన్ని బానే ఇచ్చినా రానురాను కోడిగుడ్లు, అరటిపండ్లు అందించడం మానేశారు. ఇదేంటని ఆరా తీస్తే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి సమయానికి భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని రోగులు, బంధువులు కోరుతున్నారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు

- రివ్యూ మీటింగ్‌లో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ గరం గరం
- మున్సిపల్ సిబ్బంది, బిల్ కలెక్టర్లకు సీరియస్ వార్నింగ్
- హాట్ టాపిక్‌గా 'ఆంధ్రజ్యోతి' కథనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దిపేటటౌన్, జనవరి 30 : మున్సిపల్ పరిధిలో ఇంటి నిర్మాణానికి, వివిధ పనుల కోసం వచ్చే వారి నుంచి ఏ అధికారి, సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పైసలిస్తేనే పని' కథనంపై మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, బిల్ కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటి అనుమతుల కోసం వచ్చే యజమానులు టీఎస్ బీ పాస్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డాక్యుమెంట్లు అన్నీ సవ్యంగా ఉంటే వాటిని పరిశీలించి 21 రోజుల్లో అనుమతులు అందజేస్తామని చెప్పారు. అందుకు ఇంటి యజమానులు మున్సిపల్ సిబ్బందికి ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. అనుమతులు పొందిన తరువాత ఇచ్చిన ప్లాన్ ప్రకారం నిర్మించుకోవాలని, లేదంటే అనుమతి లేకుండా నిర్మించిన వాటిని కూల్చివేస్తామని స్పష్టం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

భువనగిరి జడ్పీచైర్మన్‌పై దాడి దారుణం

- జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట టౌన్, జనవరి 30 : భువనగిరి జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డిపై దాడి దారుణమని సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడారు. అధికార మదంతో మంత్రి ఆటవికంగా ప్రవర్తిస్తున్నారని, సందీప్‌రెడ్డిపై జరిగిన దాడి ఆయన ఆటవిక ప్రవర్తనకు తార్కాణమన్నారు. దాడి సమయంలో రక్షించాల్సిన పోలీసులు సందీప్‌రెడ్డిని నెట్టివేయడం దారుణమని, అత్యుత్సాహం ప్రదర్శించిన రాచకొండ పోలీసులపై డీజీపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అంటేనే దాడుల సంస్కృతి అని మరోసారి నిరూపితమయిందని తెలిపారు. మొన్నటికి మొన్న కొండా సురేఖ, పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అవమానించారన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అన్న నోరే చేతులతో నెట్టేదాకా చేరిందని మండిపడ్డారు. మీరు గ్యారంటీలు అమలు చేయకపోతే మీకు త్వరలోనే ప్రజలు వారంటీ ప్రకటిస్తారని ఎద్దేవా చేశారు. కరెంట్ కోతలు మొదలు అయ్యాయని, ప్రజలు వాతలు పెట్టె రోజులు దగ్గర పడ్డాయని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, నాయకులు ఎల్లారెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు భువనగిరి జడ్పీ చైర్మన్‌పై జరిగిన దాడిని ఖండించారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

యాసంగి వరిలో

సస్యరక్షణ చర్యలు

- 3.77లక్షల ఎకరాల్లో వరినాట్లు
- జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

నారాయణరావుపేట, జనవరి 30: యాసంగి వరి పంటలో కాండం తొలిచే పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. మంగళవారం నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో వ్యవసాయశాఖ, తోర్నాల వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 77 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని తెలిపారు. రెండు సంవత్సరాలతో పోల్చితే ఈ సంవత్సరం పిలుక దశలో కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. కాండం తొలిచే పురుగు నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు. పొలంలో గుళికల మందులు వాడితే ఖర్చులు ఎక్కువ అవుతాయన్నారు. నాటు వేసే వారం రోజుల ముందు ఎకరాకు సరిపడే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు లేదా 600 గ్రాముల ఫిప్రోరాన్0.3జీ గుళికలు వేయాలన్నారు. ఒకవేళ నారుమడిలో వేయకపోతే 15 రోజుల వయసున్న, పిలుక దశలో ఉన్న వరి పైరులో యాసంగిలో తప్పకుండా ఎకరాకు కార్బోఫ్యురాన్3జీ గుళికలు10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు లేదా క్లోరంట్రానీల్ ప్రోల్ 0.4జీ నాలుగు కిలోలు వేయాలని సూచించారు. కొన్ని వరి పంట పొలాల్లో ఇప్పటికే లార్వా దశలో వరి పైరును నష్టపరుస్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. ఇలాంటి ప్రాంతాల్లో కార్టఆఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి లేదా క్లోరాంట్రానీలిప్రోల్ -0.3 మి.లీ. ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పంటలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవయ్య, తొర్నాల వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ శ్రీదేవి, ఏరువాక కో ఆర్డినేటర్ జే.విజయ్, శాస్త్రవేత్తలు రమాదేవి, సరిత, మండల వ్యవసాయ అధికారి వెంకటరమణి, ఎఈవో నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి ప్రభాకర్
- గాంధీ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్మికులకు సన్మానం

హుస్నాబాద్, జనవరి 30 : జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం పొన్నంప్రభాకర్ హుస్నాబాద్‌లోని మల్లెచెట్టు చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మున్సిపల్‌లోని 111 మంది పారిశుధ్య కార్మికులను పూలమాలలు, శాలువాలతో పాలకవర్గంతో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి దుస్తులను పంపిణీ చేశారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అందరం కలిసి ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దామని చెప్పారు. హుస్నాబాద్ మున్సిపల్‌కు మూడుసార్లు అవార్డు రావడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కమిషనర్ రాజశేఖర్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు బోజు రమాదేవి, సరోజన, వల్లపు రాజు, చిత్తారి పద్మ, రత్నమాల, అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, గడిపె సారయ్య తదితరులున్నారు. పరిశుభ్రతను కాపాడంలో కీలకపాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికులను మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానాలతో గౌరవించడమే కాకుండా వారిని కుర్చీల్లో కూర్చోబెట్టి తాను నేలపై కూర్చుని వారిపై తన ప్రేమను చాటుకున్నారు.


పారిశుధ్య కార్మికులను కుర్చీలో కూర్చోబెట్టి తాను కింద కూర్చున్న మంత్రి పొన్నం ప్రభాకర్


గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీ అనురాధ

గాంధీ సేవలు మరువలేము : సీపీ

సిద్దిపేటక్రైం, జనవరి 30: స్వాతంత్ర పోరాటంలో గాంధీజీ సేవలు మరువలేనివని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో ఆమె గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ఎస్.మల్లారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ధరణికుమార్, ప్రసాద్, ఏవో యాదమ్మ, సూపరింటెండెంట్లు ఎస్.కె జమీల్ అలీ, మహ్మద్ ఆజాద్, ఫియాజుద్దీన్, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు.

ఫిబ్రవరిలోనూ సీసీఐ కొనుగోళ్లు

- జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు

గజ్వేల్, జనవరి 30 : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వచ్చే నెలలోనూ పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని సిద్దిపేట జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు తెలిపారు. ఈ నెల 31తో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ముగుస్తాయని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌ను కొనుగోళ్లు జరపాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఫిబ్రవరిలోనూ కొనుగోళ్లు జరుపుతామని తెలిపారన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నాణ్యమైన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు.



కమ్మేసిన పొగమంచు

చేర్యాల, జనవరి 30 : చేర్యాలలో రోజురోజుకూ పొగమంచు ప్రభావం పెరుగుతున్నది. మంగళవారం జనగామ-సిద్దిపేట జాతీయ రహదారిని పొగమంచు కమ్మేసింది. వాహనదారులు లైట్లు వేసుకుని తమ ప్రయాణాన్ని కొనసాగించారు. పొగమంచు ప్రభావంతో మార్నింగ్ వాకర్స్ సంఖ్య తగ్గింది. ఉదయం 10గంటలకు మంచు తీవ్రత తగ్గడంతో భానుడు దర్శనమిచ్చాడు.

కుష్ఠు నిర్మూలనపై

అవగాహన


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్

సిద్దిపేట టౌన్, జనవరి 30: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం సిద్దిపేటలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జనవరి 30న జాతీయ లెప్రసీ నిర్మూలన దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేటి షీబా, డీపీఎంవోలు కృపలాదేవి, లక్ష్మణాచారి, ప్రేమ్‌చందర్, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

బాటిళ్లలో పెట్రోల్‌ను అమ్మకూడదు

- రాత్రివేళల్లో బంకుల్లో ఎక్కువ డబ్బు ఉంచొద్దు
- సిద్దిపేట సీపీ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, జనవరి 30 : బాటిళ్లలో పెట్రోల్ ఎవరికీ అమ్మకూడదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ పెట్రోల్ బంక్ యజమానులకు సూచించారు. సిద్దిపేటలో ఉన్న పెట్రోల్ బంక్ యజమానులతో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకులు నడుస్తున్న తీరు, సేఫ్టీ గురించి అసోసియేషన్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంకుల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయో ప్రతిరోజూ పరిశీలించాలని సూచించారు. రాత్రివేళల్లో బంకుల్లో ఎక్కువ మొత్తంలో డబ్బు ఉంచకూడదని తెలిపారు. బంక్ ఆవరణల్లో ఎవరూ సిగరెట్, హానికర వస్తువులు వెలిగించకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పెట్రోల్ బంకు ఆవరణలో సెల్‌ఫోన్లు సైతం వినియోగించకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పెట్రోల్‌పంప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేష్, ఉపాధ్యక్షుడు రాజ నరేందర్, రేఖ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ రమేష్, కార్యవర్గ సభ్యులు పలువురు పాల్గొన్నారు.


సిద్దిపేటలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పెట్రోల్ బంక్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న సీపీ అనురాధ

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

చిన్నకోడూరు, జనవరి 30 : అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్‌ను మంగళవారం ఆమె సందర్శించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసులు, డాగ్ కెనాల్, బీడీ టీమ్, ఆయుధాల గదిలో ఉన్న తుపాకులను పరిశీలించి మాట్లాడారు. అంతకు ముందు సిద్దిపేట పట్టణ శివారులోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు రాంచందర్‌రావు, సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచందర్, రాజేష్, ధరణికుమార్, ప్రసాద్, రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్‌లు సాయి చరణ్, రోహిత్, వెంకట్ రమణ, రంజిత్, బాలకృష్ణ, సురేష్, పుష్ప, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

గుమ్మడిదల, జనవరి 30 : గుమ్మడిదల అటవీ సెక్షన్ పరిధిలోని నల్లవల్లి గ్రామ శివారులో మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ భల్చిత్ సింగ్ సిబ్బందితో అక్కడికెళ్లి, పోస్టుమార్టం అనంతరం దహనసంస్కారాలు నిర్వహించారు. గతంలోనూ ఎన్నో వన్యప్రాణులు వాహనాదారుల అతివేగం కారణంగా ప్రాణాలు కోల్పోయాయి. అయినా ఫారెస్టు అధికారులు రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రమాదంలో మృతిచెందిన జింక

మెదక్‌లో ఇంటర్ మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మెదక్ అర్బన్, జనవరి 30: మెదక్ కేంద్రంగా ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇంటర్ విద్యా జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మైనంపలి రోహిత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శశిధర్, అశోక్, సురేష్‌బాబు మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి జిల్లా క్యాంప్ కార్యాలయం మెదక్‌లో ఉండేదని, ఆ తర్వాత సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు కేటాయించారన్నారు. మూల్యాంకన కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అవనిష్‌రెడ్డి, శ్రీకాంత్, మహాలక్ష్మిదేవి, ఉస్మాన్ పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు, వ్యక్తి మృతి

జహీరాబాద్, జనవరి 30: బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమాదం జహీరాబాద్ మండలంలోని బూడ్డిపాడ్ శివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్నది. కర్ణాటకలోని మన్నెల్లికి చెందిన వినోద్(31) వ్యక్తిగత పనులమీద జహీరాబాద్‌కు వస్తున్నాడు. వెనుకవైపు నుంచి వచ్చిన కారు అతని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వినోద్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వినోద్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.



మృతిచెందిన వినోద్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, జనవరి 30: మొగుడంపల్లి మండలంలోని విట్టునాయక్ తండాలో మాణిక్(40) అనే వ్యక్తి మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విట్టునాయక్‌తండాకు చెందిన మాణిక్‌కు హైదరాబాద్‌కు చెందిన సంధ్యతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో అతడు తన స్వగ్రామానికి వచ్చి పొలం పనులు చేసుకుంటున్నాడు. జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఆసుపత్రికి తరలించించారు. మాణిక్ తల్లి జమ్నీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపారు.

'ఆదర్శ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి'

పుల్‌కల్, జనవరి 30: మండలంలోని బస్వాపూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏబీవీపీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీహెచ్‌పీ ధర్మ ప్రసార్ రాష్ట్ర సహ ప్రముఖ్ మధురనేని సుభాష్ చందర్ మాట్లాడుతూ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సీబా పాఠశాలలో సమస్యలు పరిష్కరించకుండా, క్రైస్తవ మత ప్రచారానికి ప్రాధాన్యతనిస్తున్నారని ఆరోపించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వ్యవహారశైలి పట్ల తెలంగాణ ఆదర్శ పాఠశాల రాష్ట్ర డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నా, ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సీబా పట్టించుకోవడం లేదని అన్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో దండు అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆదర్శ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న సుభాష్‌చందర్, విద్యార్థులు

అప్పుల బాధతో రియల్టర్ ఆత్మహత్య

● సంగారెడ్డి జిల్లా రామేశ్వరంబండలో ఘటన


చెన్నకేశవరెడ్డి(ఫైల్)

పటాన్‌చెరు, జనవరి 30: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అప్పులపాలైన ఓ రియల్టర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామేశ్వరంబండ గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... రామేశ్వరంబండ గ్రామానికి చెందిన చెన్నకేశవరెడ్డి భార్య, ఇద్దరు పిల్లలతో పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్నాడు. కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టాలు చవిచూడటంతో అప్పులు ఇచ్చిన వ్యక్తుల నుంచి ఒత్తిడి పెరిగింది. ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని ఫోన్లలో తరచూ వేధింపులకు దిగడంతో అప్పులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన చెన్నకేశవరెడ్డి అర్ధరాత్రి సమయంలో రామేశ్వరంబండ గ్రామ శివారులోని ఆయన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం తెల్లవారుజామున గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పటాన్‌చెరు పోలీసులు తెలిపారు.


సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సుందరీకరణ పనుల శంకుస్థాపనకు వచ్చిన మోదీకి చేర్యాల పెయింటింగ్‌ను అందజేస్తున్న రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్(ఫైల్)


హైదరాబాద్‌కు వచ్చిన బ్రిటీష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిస్‌కు చేర్యాల పెయింటింగ్‌ను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)



దావోస్ పర్యటనలో అతిథులకు చేర్యాల పెయింటింగ్‌ను కానుకగా అందిస్తున్న ఐటీమాజీ మంత్రి కేటీఆర్(ఫైల్)

వన్నె తగ్గని చేర్యాల నకాశీ పెయింటింగ్

● అతిథులకు అధికారిక లాంఛన కానుకగా ఆకర్షణ

చేర్యాల, జనవరి 30: ప్రస్తుత పోటీతత్వ పరిస్థితులలో రోజుకో కొత్త కళ ఆవిర్భవిస్తున్నా వారసత్వ కళగా వెలుగులోకి వచ్చి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన చేర్యాల పెయింటింగ్స్ హవా కొనసాగుతూ ఉన్నది. పాలకులు మారినా, ప్రజాప్రతినిధులు మారినా, అధికారులైనా, అతిథులు ఎవరైనా వారి చేతుల్లో ఒదిగి రాష్ట్ర కీర్తిని ఇనుమడింపజేస్తూ ఔరా అని మంత్రముగ్ధులను చేస్తున్నది. గతంలో కాన్వాజ్ వస్త్రంపైనే రూపుదిద్దుకున్న నకాశీ చేర్యాల పెయింటింగ్స్ కాలానికనుగుణంగా రూపాంతరం చెంది ప్రభుత్వ లాంఛన వస్తు కానుకగా మారడంతో చేర్యాల పేరు మారుమోగుతున్నది. పలు ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్టేషన్లు, అండర్‌పాస్ బ్రిడ్జిలపై వాల్ పెయింటింగ్స్‌గా నిలిచిన చేర్యాల చిత్రకళలతో కొన్నాళ్ల క్రితం రాజ్‌భవన్‌లో టన్నెల్‌ను సుందరీకరించారు. టన్నెల్‌ను ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చిత్రకళలను అభినందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఐటీమంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనలలో అతిథులతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు మర్యాదపూర్వకంగా చేర్యాల పెయింటింగ్స్‌ను అందించారు. కొన్నినెలల క్రితం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని మోదీకి రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చేర్యాల పెయింటింగ్స్‌ను అందించారు. కొద్దిరోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో అతిథులతో పాటు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన బ్రిటీష్ హైకమిషనర్ అలెక్స్ ఎల్లిస్‌కు చేర్యాల పెయింటింగ్‌ను అందజేశారు.

ఇలా వచ్చి.. అలా వెళుతున్నారు!

● డిప్యూటేషన్‌పై వెళుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది
● ఇబ్బందులు పడుతున్న అల్లాదుర్గం ప్రజలు


అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అల్లాదుర్గం, జనవరి 30: గ్రామీణ ప్రాంత రోగులకు వైద్య సేవలందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులకు డిప్యూటేషన్ రోగం పట్టుకుంది. ఈ ఆసుపత్రిలోని వైద్యాధికారి జీతో పాటు వైద్యసిబ్బంది డిప్యుటేషన్లపై వారికి అనుకూలంగా ఉన్న మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు బదిలీ చేయించుకుంటున్నారు. ఈ ఆసుపత్రిలో విధులు నిర్వహించే కింది స్థాయి నుంచి వైద్యాధికారి వరకు బదీలీ కావడంతో ఈ ప్రాంత రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ అశ్విని డిప్యూటేషన్‌పై వికారాబాద్ జిల్లాలకు బదిలీ కాగా ఆమె స్థానంలో జిల్లాలోని పెద్దశంకరంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి సారిక ఇక్కడికి వచ్చారు. ఇదిలా ఉంటే స్టాఫ్ నర్సు విజయరూప డిప్యూటేషన్‌పై సంగారెడ్డి జిల్లాలోని మరో ఆసుపత్రికి బదిలీ కాగా ఆమె స్థానంలో ఇంతవరకు ఎవ్వరినీ నియమించలేదు. మహిళా సూపర్‌వైజర్ స్వరూప సైతం వికారాబాద్ జిల్లాకు బదీలీ అయింది. ఈ రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఆసుపత్రిలో సూపర్‌వైజర్ యాదయ్య రెండేళ్ల క్రితం పదోన్నతిపై బదిలీ కాగా ఆయన స్థానంలో ఇతరులను నియమించకపోవడంతో ఇదీ ఖాళీగా ఉన్నది. ఈ ఆసుపత్రి మహిళా ఏఎన్ఎంలు ఇద్దరు బదిలీ కాగా వారి స్థానంలో ఎవరినీ నియమించకపోవడం శోచనీయం. ఇలా ఈ ఆసుపత్రికి వచ్చిన వైద్యాధికారులు, వైద్యసిబ్బంది అలా వచ్చి ఇలా డిప్యుటేషన్లపై బదిలీ చేకోవడం పట్ల మండల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టెన్త్ విద్యార్థులకు 'కేసీఆర్ డిజిటల్ కంటెంట్ గిఫ్ట్'

● సిద్దిపేట నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా హరీశ్‌రావు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

సిద్దిపేట క్రైం, జనవరి 30: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించేలా ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి వాటిని పాటించేలా చేస్తున్నారు మాజీ మంత్రి హరీశ్‌రావు. గత సంవత్సరం నుంచి డిజిటల్ కంటెంట్ రూపంలో జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సంవత్సరం సిద్దిపేట నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు ఇవ్వనున్నారు.

తల్లిదండ్రులకు ఉత్తరం, ఇంట్లో డిజిటల్ పాఠాలు

ఒక వైపు ఉత్తరం.. మరోవైపు పాఠశాలలో ప్రత్యేక తరగతులు వీటితో పాటు సరికొత్త కార్యక్రమానికి హరీశ్‌రావు స్వయంగా శ్రీకారం చుట్టారు. ప్రత్యేక తరగతులతో పాఠశాలలో చదివితే, ఇంట్లో ఉండి చదివేల వారి మేధస్సుకు ఇంకా పదును పెట్టేలా డిజిటల్ స్టడీ అనే వినూత్న కార్యక్రమాన్ని గత సంవత్సరం ప్రారంభించారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందజేయనున్నారు. డిజిటల్ కంటెంట్‌తో గతేడాది మెరుగైన ఫలితాలు వచ్చిన నేపథ్యంలో ఈసారి అందజేస్తున్నారు. ఇంట్లో కూడా అర్థం కానీ పాఠాలను చదివేల ఈ కార్యక్రమం చేపట్టారు. 'కేసీఆర్ డిజిటల్ కంటెంట్ టీహెచ్ఆర్ గిఫ్ట్' పేరుతో పదో తరగతి విద్యార్థులకు డిజిటర్ బుక్‌లు అందజేస్తున్నారు. పదో తరగతి భవితకు పునాదని, పైచదవులకు స్ఫూర్తి కావాలని, పాఠశాలలోనే కాదు ఇంటి వద్ద చదువుకునే కొత్త కార్యక్రమానికి మంత్రి శ్రీకారం చుట్టి విద్యార్థుల్లో ఉత్సాహం నింపి ఆత్మవిశ్వాసం కల్పిస్తున్నారు. సిద్దిపేట జిల్లా పదో తరగతి ఫలితాల్లో గతేడాది రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది సిద్దిపేట నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా హరీశ్‌రావు విద్యాశాఖ అధికారులకు ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నేరుగా ఉత్తరం రాయడంతో పాటు వారిని ఇంటి వద్ద చదివించేలా ప్రోత్సహిస్తున్నారు.

రాచన్నస్వామి హుండీ ఆదాయం రూ.3.35 లక్షలు

కోహీర్, జనవరి 30: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్న స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించామని ఈవో శివ రుద్రప్ప తెలిపారు. గడిచిన నాలుగు నెలలకు సంబంధించి భక్తులు స్వామివారికి సమర్పించుకున్న హుండీ ఆదాయం రూ.3 లక్షల 35 వేల 388 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, గ్రామస్థులు సుధాకర్, రాజప్ప, ప్రతాప్‌రెడ్డి, రాచన్న, శ్రీపాల్, శంకరయ్య, స్వామి, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బడ్‌చిప్ సాగుతో ప్రయోజనం

● తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు
● రైతులు ఈ విధానం పాటిస్తే మరింత ఉపయోగం


కేవీకేలో బడ్‌చిప్‌తో(చెరకు కన్నులు) పెంచిన చెరకు నారు

జహీరాబాద్, జనవరి 30: జహీరాబాద్ ప్రాంతంలో రైతులు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు. ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంత భూములు గరుకు, ఎర్రనేలతో కూడినవిగా ఉండడంతో రైతులు ప్రధాన పంటగా చెరకును సాగుచేస్తారు. చెరకు పంట తరలింపు తదితర విషయాల్లో నష్టం వచ్చినా అన్ని వాతావరణాలకు తట్టుకుని పండే పంట కాబట్టి ఈ ప్రాంత రైతులు చెరకు సాగుపై అమితాసక్తిని చూయిస్తారు.

బడ్‌చిప్ విధానంతో సాగు ఇలా...

రైతులు సహజంగా చెరకు గడలను ముక్కలుగా నరికి వారివారి పంట పొలాల్లోని కాలువల్లో వేసి నీటిని వదులుతూ చెరకు గడలను కాళ్లతో తొక్కుతారు. ఈ విధానం వల్ల చెరకు విత్తనం ఎకరాకు సుమారు 8 టన్నుల వరకు కావాల్సి వస్తున్నది. చెరకు ముక్కలను పొలాల్లో వేసి నాటితే ఎకరాకు రూ.50-60వేల వరకు ఖర్చవుతున్నది. బడ్‌చిప్ విధానం ద్వారా సాగుచేస్తే ఎకరాకు చెరకు విత్తనం 4 టన్నులు మాత్రమే సరిపోతున్నదని రైతులు, అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు గాను రూ.30-40 వేల వరకే ఖర్చవుతుందని వారు వివరించారు. చెరకు గడలకు ఉన్న కన్నులను తొలగించి పాలిహౌజ్‌లో నారుగా తయారు చేసి పొలాల్లో మొక్కలను నాటడాన్ని బడ్‌చిప్ విధానమని అధికారులు తెలిపారు. చెరకు గడలకు ఉన్న కన్నులను కూలీల ద్వారా, లేక యంత్రం ద్వారా తొలగిస్తారు. తొలగించిన చెరకు కన్నులను ఒక దగ్గర పోగుచేసి ముందస్తుగా విత్తన శుద్ధి చేస్తారు. అనంతరం వాటిని ట్రేలలో ఏర్పాటు చేసిన గడులను కోకాపాట్‌తో నింపి కన్నులు వేసి నారుమడుల తరహాలో 25-30 రోజుల వరకు పాలిహౌజ్‌లను ఏర్పాటు చేసి పెంచుతారు. పెరిగిన చెరకు నారును పొలాల్లో మొక్కకు మొక్కకు 20-30 సెంటీమీటర్లు మధ్య దూరంలో నాటుతారు. ఈ విధంగా నాటడం వల్ల మొక్కకు తోడుగా పిలకలు ఎక్కువ సంఖ్యలో వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

బడ్‌చిప్ విధానంపై అవగాహన కల్పిస్తున్నాం

రైతులకు బడ్‌చిప్ విధానం ద్వారా చెరకు పంటలను సాగు చేయాలని తరచూ అవగాహన కల్పిస్తున్నాం. ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చు వస్తుంది. కేవీకే ఆధ్వర్యంలో ప్రతియేటా రెండేసి గ్రామాల చొప్పున పెంచిన విత్తనాన్ని కొంతమంది రైతులకు ఇస్తున్నాం. ఈ ఏడాది బిడెకన్న, చీలపల్లి, రేజింతల్, సిద్దాపూర్‌తండా తదితర ప్రాంతాల్లో ఎకరాకు సరిపడ నారును 50 మంది రైతులకు అందజేస్తాం.

- రమేష్, డీడీఎస్-కేవీకే పంట యాజమాన్య శాస్త్రవేత్త

నార్సింగి విద్యార్థులకు కరాటేలో గోల్డ్‌మెడల్స్


గోల్డ్ మెడల్ సాధించిన నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

చేగుంట, జనవరి 30: నార్సింగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కరాటే పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించారు. సెకండ్ ఇంటర్నేషనల్ ఓపెన్ ఇన్విటేషన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ ఇండోర్ స్టేడియంలో 28, 29 తేదీల్లో జరిగిన కరాటే పోటీల్లో నార్సింగి నుంచి ప్రణతి, గీతిక, శరణ్య మొదటిస్థానంలో గోల్డ్ మెడల్స్, సర్టిఫికేట్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ హీరో సుమన్, కరాటే మాస్టర్ సంపత్‌కుమార్, గ్రాండ్ మాస్టర్ హరిప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్, పీఈటీ శ్రీధర్‌రెడ్డి తదితరులు అభినందించారు. ఈ విషయం తెలుసుకున్న జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి పాఠశాలకు చేరుకుని విద్యార్థులను అభినందించి ఆర్థికంగా సహాయం చేస్తానని హామీఇచ్చారు. ఇందులో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు, ప్రధాన కార్యదర్శి అంచనూరి రాజేష్, నర్సంపల్లి మాజీ ఎంపీటీసీ సత్తయ్య పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


శ్రీహరి(ఫైల్)

రాయపోల్, జనవరి 30: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాయపోల్ గ్రామానికి చెందిన బ్యాగరి శ్రీహరి(40) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. రోజు మాదిరిగానే సోమవారం కడుపులో నొప్పి వస్తుందని ఇంట్లో తెలుపగా భార్య గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. అనంతరం ఆమె అంగన్‌వాడీ కార్యకర్త కావడంతో కేంద్రానికి వెళ్లింది. విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి శ్రీహరి రేకుల షెడ్డులో ఉరేసుకుని మృతిచెంది ఉన్నాడు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘుపతి తెలిపారు.



బడికి తాళం.. ఆరుబయటే విద్యార్థులు!

నాగల్‌గిద్ద మండల పరిధిలోని కిషన్‌నాయక్‌తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులూ మంగళవారం విధులకు డుమ్మా కొట్టారు. దీంతో పాఠశాల తలుపులు తెరుచుకోకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సరిగ్గా విధులు నిర్వహించే ఉపాధ్యాయులను పంపాలని తండావాసులు కోరుతున్నారు. - నాగల్‌గిద్ద

'దళితబంధు'కు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలి

● సర్పంచ్ ఇంటి ఎదుట దళితుల ఆందోళన


సర్పంచ్ ఇంటి ఎదుట కుటుంబసభ్యులతో కలిసి ఆందోళనకు దిగిన దళితులు

మద్దూరు, జనవరి 30: దళితబంధు ఇప్పిస్తాననడంతో రెండున్నరేళ్ల క్రితం అప్పులుచేసి డబ్బులు ఇచ్చామని, వాటిని తిరిగి ఇవ్వాలంటూ సర్పంచ్ ఇంటి ఎదుట ఎమ్మార్పీఎస్ మండల నాయకులతో కలిసి బాధితులు ఆందోళనకు దిగారు. దూళిమిట్ట మండలం తోర్నాల గ్రామానికి చెందిన మ్యాక యాదగిరి, పంగ ఎల్లయ్య, పేరం రవి, మ్యాక శేఖర్, పేరం పరశురాములు, ఎర్ర మల్లేశం సర్పంచ్ తాళ్లపల్లి రాజమ్మ కుమారుడు భిక్షపతిని రెండున్నరేళ్ల క్రితం దళితబంధులో అవకాశం కల్పించాలని కోరగా.. కొన్ని ఖర్చులు ఉంటాయని ఒక్కొక్కరు రూ.లక్ష ఇవ్వాలని చెప్పాడు. అందుకు ఐదుగురు లక్ష ఇవ్వగా.. పేరం పరశురాములు రూ.50 వేలు మొత్తం రూ.5.50 లక్షలు అందించారు. అయితే రెండున్నరేళ్లుగా దళితబంధులో అవకాశం కల్పించకపోవడంతో నిలదీయగా.. వచ్చే జాబితాలో వస్తుందని మభ్యపెట్టాడని తెలిపారు. అయినా రాకపోవడంతో సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వద్దకెళ్లి విషయం చెప్పామన్నారు. దీంతో ఎమ్మెల్యే సర్పంచ్ కుమారుడికి ఫోన్‌చేసి తీసుకున్న డబ్బులు ఇవ్వాలని చెప్పారు. మంగళవారం బాధితులు భిక్షపతి ఇంటికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని కోరగా.. 'నేనెందుకు ఇస్తాను.. నేను ఎవరికి ఇచ్చానో వారి నుంచి వసూలు చేసి ఇస్తానని చెప్పడంతో కుటుంబసభ్యులతో కలిసి సర్పంచ్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగామన్నారు. తాను మండలంలో ఓ పెద్ద మనిషికి డబ్బులు ఇచ్చానని చెప్పి సర్పంచ్ కుమారుడు చేర్యాలకు వెళ్లిపోయాడని బాధితులు వాపోయారు. దళితుల నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మాజీ మండలాధ్యక్షుడు సుందరగిరి భాస్కర్ డిమాండ్ చేశారు.

జిల్లాలో కుష్ఠువ్యాధిపై అవగాహన


జగదేవ్‌పూర్: తిగుల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

గజ్వేల్/జగదేవ్‌పూర్/మద్దూరు, జనవరి 30: ప్రపంచ లెప్రసీ డేను పురస్కరించుకుని మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో గల బస్తీ దవఖానాలో కుష్ఠు వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కౌన్సిలర్ మామిడి విద్యారాణి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఏఎన్ఎం సరస్వతి, ఆశావర్కర్లు ఉన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. తిగుల్ గ్రామంలో విద్యార్థులు వైద్యులు కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, సర్పంచులు లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, భానుప్రకాష్ రావు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో పల్లె దవాఖాన వైద్యాధికారి ప్రతిభ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ప్రజలకు కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశాలు యశోద, కవిత, కనక లక్ష్మితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి: డీఐఈవో

సిద్దిపేట క్రైం జనవరి 30: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూర్య ప్రకాశ్ సూచించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ప్రాక్టికల్ పరీక్షల సన్నాహక సమావేశం పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసిన అన్ని కళాశాలల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు నియమితులైన డిపార్టుమెంటల్ అధికారులు ఒక రోజు ముందుగానే చేరుకుని అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలన్నారు. ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లు ఒక సెషన్ ముందుగానే చేరుకుని ఏర్పాట్లు, ప్రయోగ సామగ్రిని సరిచూసుకోవాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈసీ మెంబర్లు, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు


సిద్దిపేటలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


గజ్వేల్ పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎన్‌సీ రాజమౌళి


హుస్నాబాద్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రజిత

జాతిపిత గాంధీజీ అందరికీ ఆదర్శం

మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్లలో గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


చేర్యాలలో గాంధీవిగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మద్దూరు: రేబర్తిలో గాంధీ చిత్రపటం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

సిద్దిపేట టౌన్, జనవరి 30: సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మా గాంధీ అందరికీ ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మార్క సతీష్ గౌడ్, దాసరి రాజు, గయాజుద్దీన్, దాస అంజయ్య, సంపత్, రాకేష్‌రెడ్డి, నజ్జు, బైరి సాయి తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** మహాత్మాగాంధీ ఆశయసాధనకు కృషి చేయాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పిలుపునిచ్చారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని కోర్టువద్ద గల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్, ఎన్‌సీ సంతోష్, గోలి సంతోష్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ది భిక్షపతి, ఆర్యవైశ్య సంఘం నాయకులు అత్తెల్లి లక్ష్మయ్య, శివకుమార్, కృష్ణమూర్తి, ఉమేశ్, సిద్దేశ్వర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

● **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు రమాదేవి, కోమటి స్వర్ణలత, మ్యాదరబోయిన శ్రీను, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఎండీ అయూబ్, అయిలేని శంకర్‌రెడ్డి, పున్న సది, రవీందర్ తదితరులున్నారు.

● **చేర్యాల:** చేర్యాల, కొమురవెల్లి మండలకేంద్రాల్లోని గాంధీ విగ్రహాలకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● **మద్దూరు:** మండలంలోని రేబర్తి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సెక్రటరీ మాధవ్ జాదవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీలు

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి బంగారు, వెండి వస్తువులతో పాటు నగదును దోచుకున్నారు.


మిరుదొడ్డి: అల్వాల్‌లో డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

మిరుదొడ్డి, జనవరి 30: మండలంలోని అల్వాల్ గ్రామంలో ఒకేరోజు మూడిళ్లలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి అల్వాల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మ నవీన్, రొడ్డ నర్సవ్వల ఇళ్ల తాళాలను పగులగొట్టి రూ.10వేల నగదుతోపాటు వెండి బంగారం కమ్మలు ఎత్తుకెళ్లినట్టు బాధితులు వాపోయారు. మంగళవారం ఈ సమాచారమందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనాస్థలం వద్ద క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లొచ్చేసరికి చేర్యాలలో ఇల్లు గుల్ల

చేర్యాల, జనవరి 30 : ఇంటిల్లిపాది దైవదర్శనంకోసంవెళ్లి తిరిగి వచ్చేసరికి దొంగలు ఇల్లు గుల్ల చేశారు. ఈ సంఘటన చేర్యాల పట్టణంలో జరిగింది. పట్టణ శివారు కడవేరుగు దారిలో నివాసముంటున్న పోతురెడ్డి దేవేందర్‌రెడ్డి ఈ నెల 26న కుటుంబంతో కలిసి తిరుపతికి వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు ధ్వంసం చేసి బీరువాలోని 3.4తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. మంగళవారం ఇంటికి చేరుకున్న బాధితుడు చోరీ జరిగిందని గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

హుస్నాబాద్ పట్టణంలో...

హుస్నాబాద్, జనవరి 30: హుస్నాబాద్ పట్టణం నాగారం చౌరస్తా సమీపంలోని వెలిదండి రాజేంద్రప్రసాద్ అనే ఎల్ఐసీ ఏజెంట్‌కు చెందిన ఇంట్లో మంగళవారం పట్టపగలు చోరీ జరిగింది. బీరువాలోని దాదాపు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 60 వేల నగదును దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. రాజేంద్రప్రసాద్‌తో పాటు అతడి భార్య ఉదయం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా వేసిన తాళం ధ్వంసమై ఉంది. ఇంట్లో చిందరవందరగా పడిఉన్న వస్తువులతో పాటు బీరువాను పరిశీలించి చోరీ జరిగినట్లు గ్రహించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్‌కు రప్పిస్తున్నామని, పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు.

టిఫిన్ సెంటర్లో అగ్నిప్రమాదం.. రూ.2లక్షల ఆస్తి నష్టం

సిద్దిపేట క్రైం, జనవరి 30: సిద్దిపేటలోని పాత బస్టాండ్ వద్ద ఓ టిఫిన్ సెంటర్‌లో మంగళవారం ఉదయం గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు చెలరేగాయి. టిఫిన్ సెంటర్ సిబ్బంది వెంటనే బయటకు వచ్చి కొంత వరకు మంటలను ఆర్పేందుకు యత్నిస్తు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను ఆర్పి వేశారు. అప్పటికే వంట గది పూర్తిగా దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు సిద్దిపేట ఫైర్ ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

జగదేవ్‌పూర్, జనవరి 30: వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జగదేవ్‌పూర్, అలిరాజ్‌పేట గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదలను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

మద్దూరు, జనవరి 30: వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి కోరారు. మంగళవారం మద్దూరు మండల కేంద్రంలో మేక మల్లేశం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2020 జనవరి నెల వరకు ఏదైనా గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారు ఓటు హక్కు కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పట్టభద్రుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయాలి

చేర్యాల, జనవరి 30: పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా ఓటరు దరఖాస్తు చేసుకున్న పట్టభద్రులవద్దకు వెళ్లి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయాలని సీపీఐ నాయకుడు కత్తుల భాస్కర్‌రెడ్డి మంగళవారం చేర్యాల తహసీల్దారు రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. దరఖాస్తు చేసుకున్న పట్టభద్రులను తహసీల్ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకువచ్చి వెరిఫికేషన్ చేసుకోవాలని ఆదేశించడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

దుబ్బాకలో సామాజిక తనిఖీ

దుబ్బాక, జనవరి 30: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతివనాలు, డంప్ యార్డు పనులు, శ్మశానవాటికలపై అదనపు పీడీ కౌసల్యదేవి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ చేశారు. గ్రామాల్లోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై సమీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ బాల్‌రాజు, ఎంపీపీ పుష్పలత, ఎంపీడీవో భాస్కరశర్మ తదితరులున్నారు.

సాంఘికశాస్త్రంలో ప్రతిభా పరీక్ష

సిద్దిపేటరూరల్, జనవరి 30: రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఫోరం (టీఎస్ ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం సహకారంతో పదోతరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో ప్రతిభా పరీక్షను మండలస్థాయిలో ఫిబ్రవరి 1న, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 3న నిర్వహించనున్నట్లు టీఎస్ ఎస్‌టీఎఫ్ సిద్దిపేట రూరల్ మండల ఇన్‌చార్జి జి. బాల్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని, పాఠశాలల నుంచి పాల్గొనే విద్యార్థుల సంఖ్యను మండల బాధ్యులకు తెలపాలన్నారు.

విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ

నారాయణరావుపేట, జనవరి 30: మాజీ మంత్రి హరీశ్‌రావు ఆర్థిక సహకారంతో మంగళవారం మండలంలోని జక్కాపూర్, గుర్రాలగొంది జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని పది జీపీఏ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఆంజనేయులు, పరశురాములు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో గ్రామాల అభివృద్ధి

జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


సర్పంచుల వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు, జనవరి 30: గ్రామాలను స్వచ్ఛ, హరిత గ్రామాలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పేర్కొన్నారు. సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా మంగళవారం చిన్నకోడూరు రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్ రావు కృషితో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం సర్పంచులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు ఉమేష్‌చంద్ర, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మండల కో ఆప్షన్ మెంబర్ సాదక్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రమీందర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సోమిరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ బ్రహ్మం, పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

విద్యార్థులు బాగా కష్టపడి చదివి తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో డిజిటల్ కంటెంట్ బుక్స్‌ను మంగళవారం ఎంపీపీ మాణిక్యరెడ్డితో కలిసి ఆమె పంపిణీ చేశారు. పదోతరగతి ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏంఈవో దేశిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు, నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


జనగామలో కాంగ్రెస్ నాయకుడు కొండం బాపురెడ్డిని సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్ నేత కొండం బాపురెడ్డికి సన్మానం

అక్కన్నపేట, జనవరి 30: మండలంలోని జనగామ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండం బాపురెడ్డిని సోమవారం రాత్రి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బాపురెడ్డి తన 75 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ పార్టీ మారకుండా, ఎన్ని ఆటుపోట్లు వచ్చినా పార్టీ జెండా పట్టుకుని సైనికుడిలా పని చేశారని కొనియాడారు. ఆనాటి స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతారావు హయాం దగ్గర నుంచి నేటి వరకు బాపురెడ్డి పార్టీకి సేవలు అందిస్తున్నారన్నారు. ఇలాంటి సీనియర్లు పార్టీకి అండగా నిలవడంవల్లే కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, రెడ్డి సంఘం అధ్యక్షుడు అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పోతారం(ఎస్) ఉపసర్పంచ్ చేరిక

హుస్నాబాద్‌రూరల్, జనవరి 30: మండలంలోని పోతారం(ఎస్) ఉపసర్పంచ్ దొంతరవేని శ్రీనివాస్ మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. శ్రీనివాస్‌కు మంత్రి కాంగ్రెస్ పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజా పాలనకు ఆకర్షితుడనై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు శ్రీనివాస్ తెలిపారు.

సీపీని కలిసిన పలువురు పోలీస్ అధికారులు



సీపీ అనూరాధను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేస్తున్న చేర్యాల సీఐ శ్రీను, గజ్వేల్ ఎస్‌హెచ్‌వో సైదా

చేర్యాల/గజ్వేల్, జనవరి 30: నూతనంగా బాధ్యతలు చేపట్టిన పలువురు పోలీసు అధికారులు మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షిస్తూనే, సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, గంజాయి, డ్రగ్స్ నివారణ, తదితర విషయాలలో చిత్తశుద్ధితో పాటుపడాలని పలు సూచనలు చేశారు. కాగా చేర్యాల సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎల్. శ్రీనివాస్, గజ్వేల్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌హెచ్‌వో)గా బాధ్యతలు స్వీకరించిన బి.సైదా మంగళవారం సీపీని కమిషనరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు.

స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెదలాలి

మద్దూరు, జనవరి 30: పోలీసుస్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే వారి పట్ల మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యల్ని సావధానంగా విని పరిష్కరించాలని సిబ్బందికి చేర్యాల సీఐ ఎల్ శ్రీను సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మద్దూరు పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పరిసరాలతో పాటు కార్యాలయం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ, ఏఎస్ఐ జగదీశ్వర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాల్‌బ్యాడ్మింటన్ బాలబాలికల జట్లు

మిరుదొడ్డి, జనవరి 30: ఈ నెల 28న ఉమ్మడి మెదక్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అండర్(19) బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్టు ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భైరయ్య, జనరల్ సెక్రెటరీ పీవీ రమణ తెలిపారు. మంగళవారం మిరుదొడ్డిలో వారు వివరాలను వెల్లడించారు. బాలుర జట్టుకు అనికేత్, తన్వీష్ , సోమేష్, శశాంక్ (ఆర్‌సీపురం), సిద్దార్థ, ప్రణయ్, అనిల్‌కుమార్(మిరుదొడ్డి), భరత్‌రాజ్, మోహిన్ (అశోక్‌నగర్), కృష్ణసాయి, చైతన్య(ఓల్డ్ ఎమ్ఐజీ), నవీన్ అంబేద్కర్‌నగర్, బాలికల జట్టు తానియా, అక్షయ, సఫీయా నిఖ్కత్(ఎమ్ఐజీ), భవాని (రామచంద్రాపురం), శ్రీలక్ష్మి, అఖిల, శ్రావణి,(ఓల్డ్ ఎమ్ఐజీ), రాధిక, గాయత్రి(బీహెచ్ఈఎల్) ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైనవారు వచ్చే నెల 9నుంచి 11వరకు జరిగే 68వ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

'కస్తూర్బా'లో రేబిస్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పశువర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 30: నిర్లక్ష్యం చేస్తే కుక్కకాటు అత్యంత ప్రమాదకరమని పశువర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రేబిస్ నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కకాటుకు చికిత్స ద్వారా రేబిస్ వైరస్‌ను నిర్మూలించవచ్చన్నారు. కుక్క కాటుకు గురైనవారు ప్రథమ చికిత్సగా సబ్బు, సర్ఫ్ వినియోగించి నీటితో శుభ్రం చేయాలన్నారు. కుక్కకాటు కరిచిన రోజు, మూడవ, ఏడవ, పద్నాలుగవ రోజున యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ వేయించుకోవాలన్నారు. కుక్క కరిచిన పది రోజుల అనంతరం యాంటీ రేబిస్ జనరేట్ అవుతాయన్నారు. ఎలాంటి ప్రత్యేక ఆహార నియమాలు ఉండవని, సాధారణ ఆహారం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. అలాగే క్యాన్సర్, డయాబెటిస్ వ్యాధులున్న వాళ్లకు కుక్క కరిస్తే 5వ, 20వ రోజు రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కుక్కకాటుకు చికిత్స తప్పనిసరి అని తెలిపారు. 10 నుంచి 90రోజుల వరకు లక్షణాలు కనిపిస్తాయన్నారు. కుక్క కాటు పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే చైతన్యం పొందితే భవిష్యత్తులో మెరుగైన వైద్యం పొందేందుకు వీలుంటుందన్నారు. వారితో గజ్వేల్ పశుసంవర్ధక శాఖ ఏడీ రమేశ్‌బాబు, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, సీర్ల శ్యామల, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి అనురాధ, డాక్టర్ శ్వేత, విద్యార్థినులు ఉన్నారు.

కాళేశ్వరం జలాల రాకతో రైతుల హర్షం


రంగనాయక సాగర్ ఎడమ కాలువ నుంచి వస్తున్న నీళ్లు

నారాయణరావుపేట, జనవరి 30: యాసంగి పంటలు ఎండిపోకుండా రంగనాయక సాగర్ ఎడమ కాలువ నుంచి వారం రోజుల క్రితం నీరు విడుదల చేయడంతో మండలంలోని చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోనున్నాయి. యాసంగి పంట మొదటి దశలోనే నీళ్లు రావడంతో పంటలకు ఢోకా లేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా వచ్చే సాగు నీటితో నారాయణరావుపేట మండలంలో 15 వేల ఏకరాల ఆయకట్టుకు నీరు అందనున్నది. బావులు, చెరువులు, కుంటల్లో నీరు తక్కువగా ఉండడంతో సాగు విస్తీర్ణం కొంత మేరకు తగ్గించిన రైతులు రంగనాయకసాగర్ నీళ్లు యాసంగి పంటలకు విడుదల చేస్తారని తెలియడంతో మిగిలిన భూమిలో ఇతర పంటలు సాగుచేశారు. మండలంలోని జక్కాపూర్ గ్రామంలోని వెంకటాయ కుంట, పోలవేణి కుంటలకు ప్రాజెక్టు నీళ్లు వచ్చి జలకళ సంతరించుకున్నాయి.. జక్కాపూర్ తో పాటు మండలంలోని మల్యాల, లక్ష్మీదేవిపల్లి, నారాయణరావుపేట గ్రామాలకు నీళ్లు అందనున్నాయి. దీంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన సంక్షేమశాఖ 4వ తరగతి ఉద్యోగులకు శిక్షణ

హుస్నాబాద్, జనవరి 30: పట్టణంలోని గిరిజన పోస్ట్ మెట్రిక్ బాలికల హాస్టల్‌లో మంగళవారం జిల్లా గిరిజన సంక్షేమశాఖ 4వ తరగతి ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో పని చేస్తున్న కుక్, కమాటీ, డెయిలీ వైజ్ ఉద్యోగులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహాల్లో పరిసరాల పరిశుభ్రత, వంట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం ఫిరంగి, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, సీడీపీవో జయమ్మ, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ తులసి, శ్రద్ధ ప్రకాష్, ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు ఎం శ్రీనివాస్, ఎల్ భిక్షపతి నాయక్, శ్రీనాథ్ తదితరులున్నారు.

ఫిబ్రవరి 2న పొట్లపల్లి ఆలయంలో బహిరంగ వేలం

హుస్నాబాద్‌రూరల్, జనవరి 30: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 2న ఉదయం 11.30 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. ఆలయంలో ఏడాది పాటు కొబ్బరికాయలు అమ్ముకొనుటకు, పూజా సామగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదం, కొబ్బరి ముక్కలు, ఎండు కుడుకలు, ఒడి బియ్యం, స్వామి వారి వస్త్రాలు పోగుచేసుకునుటకు వేలం పాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వీటితో పాటు మహ శివరాత్రి జాతర కోసం తడకల పందిరి, వైట్‌పెండల్స్, ఐరన్ క్యూలైన్లు ఏర్పాటు కోసం, కేటరింగ్, టిఫిన్, బోజనం కోసం, పూల అలంకరణ, దండల కోసం, ఎలక్ట్రికల్, డెకరేషన్, సౌండ్ విద్యుత్ దీపాలంకరణ, టెంట్ సామగ్రి, రంగులు సున్నం వేసేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బహిరంగ వేలం సీల్డ్‌కవర్ టెండర్ పాటలో పాల్గొనే వారు ముందుగా దేవాదాయశాఖ నిర్ణయించిన రుసుం చెల్లించి పాటలో పాల్గొనాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్‌నెంబర్ 9010836477, 9705041199కు సంప్రదించాలని కోరారు.

బిల్లుల కోసం పాడి రైతుల ఆందోళన

ములుగు, జనవరి 30: పాల బిల్లుల కోసం పాడి రైతులు పాల సేకరణ కేంద్రం వద్ద ఆందోళన చేశారు. 15 రోజులకు చెల్లింపు చేయాల్సి ఉండగా, నెల దాటినా డబ్బులు రావడంలేదంటూ ఆందోళనకు దిగారు. ఈ సంఘటన ములుగు విజయ పాల సేకరణ కేంద్రం వద్ద మంగళవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. పాడి రైతుల నుంచి సేకరించిన పాలకు నెలరోజులు దాటినా డబ్బు చెల్లించలేదు. దీంతో విజయ పాల సేకరణ కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. తమకు రావల్సిన బిల్లుల బకాయిలు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఆలస్యం చేస్తే గజ్వేల్ విజయ డెయిరీ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో పరశురాం, నర్సింహులు, ప్రభాకర్, శ్యాం, ప్రసాద్, వెంకటేశ్, రాజయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలి


తిగుల్ జట్టుకు మొదటి బహుమతి అందజేస్తున్న దృశ్యం

గజ్వేల్, జనవరి 30: క్రీడలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్‌హబ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి బాలికల సీనియర్ ఖోఖో టోర్నీని మంగళవారం ఏర్పాటు చేయగా, ఎమ్మెల్సీ హాజరై ప్రారంభించారు. పోటీల్లో ప్రథమ బహుమతిని జడ్పీహెచ్‌ఎస్ తిగుల్(సిద్దిపేట), ద్వితీయ బహుమతిని కృష్ణాపూర్(సంగారెడ్డి), తృతీయ బహుమతిని ప్రజ్ఞాపూర్ మైనారిటీ బాలికల పాఠశాల(సిద్దిపేట), నాలుగో బహుమతిని ప్రజ్ఞాపూర్-సెయింట్ మేరీస్ విద్యానికేతన్(సిద్దిపేట) దక్కించుకున్నాయి. వారితో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, పీడీ ఎలియాస్‌రావు, పీఈటీలు విజయరేఖ, నరేశ్ ఉన్నారు.

వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చిన్నకోడూరు, జనవరి 30: వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తోర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ దాసరి శ్వేత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాచాపూర్, గోనెపల్లి, రామునిపట్ల, ఓబులాపూర్ గ్రామాల్లో ఏవో జయంత్‌కుమార్‌తో కలిసి ఆమె వరి పంటను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు శివ, జమీల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో సెల్ఫ్ విజార్డ్ డ్రామా పోటీలు

మిరుదొడ్డి, జనవరి 30: మిరుదొడ్డిలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మంగళవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో మండల స్థాయిలో సెల్ఫ్ విజార్డ్, డ్రామా పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి ప్రభుదాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి శ్రుతి జడ్పీహెచ్ఎస్ మిరుదొడ్డి, రెండో బహుమతి సంప్రీతి జడ్పీహెచ్ఎస్ అల్వాల్, నవీన్‌రెడ్డి మోడల్ స్కూల్ మిరుదొడ్డి, శ్రుతి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల మిరుదొడ్డి విద్యార్థులు గెలుపొందినట్టు తెలిపారు.

గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

● రాష్ట్ర కోఆర్డినేటర్ రంజిత్ మోహన్

సిద్దిపేట క్రైం, జనవరి 30: బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని బీజేపీ గావ్ చలో రాష్ట్ర కోఆర్డినేటర్ రంజిత్ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని శివానుభవ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి అధ్యక్షతన గావ్ చలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంజిత్ మోహన్ హాజరై మాట్లాడారు. పల్లెల్లో ప్రజల మద్దతును సంపాదించడం, ప్రజలతో మరింత సన్నిహితంగా ఉంటూ ప్రజల బాధలు తెలుసుకోవడం ఈ వర్క్‌షాప్ ఉద్దేశమన్నారు. మోదీ ప్రభుత్వం ప్రారంభించిన వివిధ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చొప్పదండి విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు విభీషన్ రెడ్డి, బూరుగు సురేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్ రావు, పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్, మీడియా ఇన్‌చార్జి గోనె మార్కండేయులు, మండలాల అధ్యక్షులు, కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ కాలనీలో గ్రంథాలయం ప్రారంభం

గజ్వేల్, జనవరి 30: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న సాగర్ పునరావాస కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలచెలిమి మరియు చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్ సహకారంతో బాలచెలిమి గ్రంథాలయం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరీమోద్దీన్, బాలచెలిమి ఫౌండేషన్ కన్వీనర్ గరిపల్లి అశోక్, మేనేజర్ ఖైజర్‌పాషా, నరేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి

గజ్వేల్, జనవరి 30: మెదక్ జిల్లాకు ప్రజాయుద్ధనౌక గద్దర్ పేరు పెట్టాలని మాల మహానాడు నాయకుడు తుమ్మ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గజ్వేల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్న ఆయనకు గౌరవంగా మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలని, హైదరాబాద్‌లో స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని, డిమాండ్ చేశారు.